క్లుప్తంగా

ఎంపీడీవో రాధాకృష్ణకు ఘన సత్కారం



బాపట్ల అర్బన్: జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఘన వ్యర్థాల నిర్వహణలో అంకితభావంతో కృషి చేసిన పలువురికి ఐటీసీ అవార్డులను ప్రకటించింది. ఇందులో ఉత్తమ అధికారిగా బాపట్ల ఎంపీడీవో రాధాకృష్ణ ఎంపిక కావడం పట్ల గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బాపట్ల మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు చిన్నపోతుల హరిబాబు ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో రాధాకృష్ణను ఘనంగా సత్కరించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం అవార్డు గ్రహీతలు మూలపాలెం గ్రామ సర్పంచ్ బొలిమేర అనిల్ కుమార్, ముత్తాయపాలెం పంచాయతీ సెక్రటరీ ఝాన్సీలక్ష్మి, అప్పికట్ల ఇంజినీరింగ్ అసిస్టెంట్ వెంకట్ కుమార్, భర్తిపూడి వలంటీర్ రాజేష్, ఈస్ట్ బాపట్ల క్లాప్ మిత్ర కృష్ణ బాబును ఈఓపీఆర్డీ పులి శరత్‌బాబు, పరిపాలన అధికారి రజని ఘనంగా సత్కరించారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



బాపట్ల అర్బన్: బాపట్ల ఎంపీడీవో రాధాకృష్ణ గురువారం పిన్నిబోయినవారిపాలెం గ్రామంలో పర్యటించారు. గ్రామ సచివాలయం, అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి సిబ్బంది పనితీరుపై పలు సూచనలు చేశారు. అనంతరం, పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. పాఠశాలలో అమలవుతున్న మధ్యాహ్న భోజనం రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలో విద్యార్థులను పలు ప్రశ్నలు వేసి విద్యాభ్యాసం, ఉపాధ్యాయుల బోధన గురించి ఆరా తీశారు. హాజరు, రికార్డులను తనిఖీ చేశారు. పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీపై అక్రమ కేసులకు వ్యతిరేకంగా నిరసన

బాపట్ల అర్బన్: రాహుల్ గాంధీపై అక్రమ కేసులు పెట్టినందుకు నిరసనగా బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గంటా అంజిబాబు ఆదేశాల మేరకు పట్టణంలో రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పార్టీ నాయకులు నిరసన చేపట్టారు. రాహుల్ గాంధీ జూడో యాత్ర వల్ల కాంగ్రెస్ పార్టీ దేశమంతా బలోపేతం అవడం ఓర్వలేని బీజేపీ ప్రభుత్వం ఇటువంటి అక్రమ కేసులు పెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు ఎస్‌వీఆర్ కుమార్, బక్క రోశయ్య, నక్కల రాంబాబు, చింత బాబురావు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలి



కొత్తనందాయపాలెం(కర్లపాలెం): కూరగాయలు, పూల సాగుచేసే రైతులు ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని సెర్ప్ డీడీఎం కేఆర్‌డీ కార్తీక్ తెలిపారు. కర్లపాలెం మండల పరిధిలోని కొత్త నందాయపాలెం గ్రామంలో నాబార్డ్ సహకారంతో సెర్ప్ సంస్థ ఆధ్వర్యంలో రైతుల అభ్యున్నతి కోసం ధరణిపుత్ర కూరగాయలు, పూల ఉత్పత్తిదారుల కంపెనీ లిమిటెడ్ కార్యాలయాన్ని గురువారం సెర్ప్ డీడీఎం కేఆర్‌డీ కార్తీక్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులుఅందించేందుకు, రైతులు పండించిన కూరగాయలు, పూలకు గిట్టుబాటు ధరలు వచ్చే విధంగా కృషి చేస్తామని చెప్పారు. రైతులు సాగులో మెలకువలు తెలుసుకుని అధిక దిగుబడులు సాధిస్తూ ఆర్థికంగా లాభాలు పొందాలని సూచించారు. కార్యక్రమంలో సెర్ప్ సంస్థ ఎల్‌డీఎం కృష్ణనాయక్, కార్యదర్శి పార్థసారథి, రైతులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

భట్టిప్రోలు: అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించాలని ఎండీయూ వాహనాల ఆపరేటర్లు గురువారం భట్టిప్రోలు ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారికి వినతిపత్రం అందజేశారు. గత రెండేళ్లుగా వాహనాల ఇన్‌స్రూ అమౌంట్ రావడం లేదని పేర్కొన్నారు. దీంతో బ్యాంకర్లు తమ జీతాల్లో కోతలు పెడుతున్నారని వాపోయారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని వారు విజ్ఞప్తి చేశారు.

నేడు పేటేరు సచివాలయం ప్రారంభం

రేపల్లె రూరల్: పేటేరులో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనాన్ని ఈ నెల 24వ తేదీ ఉదయం 9:30 గంటలకు ప్రారంభించనున్నట్లు సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు మండలి అంజయ్య తెలిపారు. రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చేతుల మీదుగా ప్రారంభం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

ప్రజలకు అందుబాటులో ఉండాలి

ఆర్డీవో జగన్నాథం పార్థసారథి



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న ఆర్డీవో పార్థసారథి

రేపల్లె రూరల్: సచివాలయాల సిబ్బంది నిత్యం తమ కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆర్డీవో జగన్నాథం పార్థసారథి సూచించారు. సచివాలయాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల తనిఖీలో భాగంగా పట్టణంలోని సాయిబాబా గుడి సమీపంలోని సచివాయంలో గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ నిర్వహించి అనంతరం మాట్లాడారు. సమస్యలపై వచ్చే ప్రజల నుంచి అర్జీలను స్వీకరించి పరిష్కరించాలని, తమ పరిధిలో లేని అంశాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించి ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని చెప్పారు. ప్రభుత్వ పథకాలను వివరించడంతో పాటు సచివాలయ కేంద్రాల్లో ప్రభుత్వ పథకాల వివరాలు ప్రజలకు కనిపించే విధంగా పోస్టర్‌లను అతికించాలన్నారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కైతేపల్లిలో..

ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులకు నాణ్యతతో కూడిన విద్యా సదుపాయాలను కల్పించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి, మండల ప్రత్యేక అధికారి విలియమ్స్ పేర్కొన్నారు. గురువారం కైతేపల్లి గ్రామంలో ఆయన పర్యటించి అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల, సచివాలయాన్ని సందర్శించి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థులు ఎక్కువగా పేదవారే ఉంటారని, అటువంటి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. చిన్నారులకు అందించే భోజనం, కూరల్లో నాణ్యత లోపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు.

జగనన్న గృహాలను యుద్ధప్రాతిపదికన పూర్తిచేయాలి

మండల ప్రత్యేక అధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు



మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి ఎం.హనుమంతరావు, పక్కన పీడీ అర్జునరావు

భట్టిప్రోలు: జగనన్న కాలనీ లే–అవుట్లలో గృహాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేక అధికారి, బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు అధికారులను ఆదేశించారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై సచివాలయ సిబ్బంది, యానిమేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. హనుమంతరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శి, ఇంజనీరింగ్ అసిస్టెంట్, ఇతర సచివాలయ సిబ్బంది స్థానిక ప్రజాప్రతినిధులతో లబ్ధిదారులను కలసి గృహాలను నిర్మించుకునేలా చూడాలన్నారు. డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బొంతా అర్జునరావు మాట్లాడుతూ మండలంలోని 12 సచివాలయాల పరిధిలో గృహ నిర్మాణాలు ప్రారంభించని 1585 మంది గృహ లబ్ధిదారులకు యానిమేటర్ల ద్వారా రూ.35 వేల చొప్పున రుణాలు ఇప్పించి నిర్మాణాలు ప్రారంభమయ్యేలా చూడాలని చెప్పారు. వచ్చే వారం నాటికి ప్రగతి చూపని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు, హౌసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్ ఏఈలు రావూరి సోమయ్య, శివకృష్ణ, శేతు రామచంద్రరావు, మండల సమాఖ్య ఏపీఎం కొండూరు శోభన్, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సీసీలు, యానిమేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా భగత్‌సింగ్ వర్ధంతి



భట్టిప్రోలు: మండలంలోని పెదపులివర్రు, భట్టిప్రోలు టీఎంరావు, విశ్వశాంతి హైస్కూళ్లలో భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్ 92వ వర్ధంతి కార్యక్రమాలు గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షుడు పి.మనోజ్‌కుమార్ మాట్లాడుతూ పట్టుదల, అధ్యయనం, ప్రాణం పోతున్నా లక్ష్యంపై ఉన్న విశ్వాసం, ప్రజా శ్రేయస్సే మిన్నగా భావించిన భగత్‌సింగ్ చిరస్మరణీయులన్నారు. వారు గతించి 92 ఏళ్లు అయినా మనందరిలో జీవించే ఉన్నారన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు ఉలవలపూడి సురేష్ కుమార్, సీఐటీయూ మండల కార్యదర్శి జి.సుధాకర్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సీహెచ్ రామకోటేశ్వరరావు, జి.భానుమతి, ఫణి పార్థసారథి, ఎస్ఎఫ్ఐ నాయకులు విజయ్, సందీప్, సుజయ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలు సకాలంలో పరిష్కరించాలి

డీఎల్‌పీవో శరత్‌బాబు



సచివాలయంలో అధికారులు, వలంటీర్లతో మాట్లాడుతున్న శరత్‌బాబు

పెదపులుగువారిపాలెం(కర్లపాలెం): గ్రామ సచివాలయంలో జరిగే గ్రీవెన్స్ కార్యక్రమానికి ప్రజల నుంచి వచ్చే అర్జీలను పరిశీలించి సమస్యలను సకాలంలో పరిష్కరించాలని బాపట్ల డివిజన్ ఇన్‌చార్జి డీఎల్‌పీవో పీడీఎస్ శరత్‌బాబు తెలిపారు. గురువారం పెదపులుగువారిపాలెం గ్రామ సచివలయాన్ని, సంపద సృష్టి కేంద్రాన్ని డీఎల్‌పీవో శరత్‌బాబు తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల ద్వారా అమలు జరిగే పథకాల పట్ల సచివాలయ ఉద్యోగులు, గ్రామ వలంటీర్లు అవగాహన కలిగిఉండాలని చెప్పారు. గ్రామ వలంటీర్లు తమ పరిధిలోని 50 గృహాలకు సంబంధించి ప్రజల సమస్యలను తెలుసుకుని అధికారులకు చెప్పి పరిష్కరించాలన్నారు. వృద్ధాప్య, వితంతు పింఛన్లతో పాటు వివిధ సంక్షేమ పథకాలను మంజూరు చేసేందుకు నిజమైన అర్హులను గుర్తించాల్సిన బాధ్యత గ్రామ వలంటీర్లపై ఉందని చెప్పారు. తడి, పొడి చెత్త వేర్వేరుగా ప్రాసెసింగ్ చేసి విక్రయించటం ద్వారా గ్రామ పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని శరత్‌బాబు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి వెంకటప్పయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

సేంద్రియ పద్ధతులపై అవగాహన



అద్దేపల్లి(భట్టిప్రోలు): భట్టిప్రోలు పంచాయతీ పరిధిలోని అద్దేపల్లి రైతు భరోసా కేంద్రంలో గురువారం సేంద్రియ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. రేపల్లె డివిజన్ పరిధిలోని ఐలవరం యూనిట్ పరిధిలోని గ్రామాల్లో రైతులకు 30 రకాల విత్తనాల ప్రిమాన్ షోయింగ్ (పీఎండీఎస్)పై అవగాహన కల్పించారు. విత్తనాలకు ఘనజీవామృతం, పొడి బంకమన్ను, ఎలిబూడిద కలిపి విత్తన గుళికలు తయారు చేయించారు. సబ్‌డివిజన్ ప్రతినిధులు మాట్లాడుతూ తొలకరి వర్షాల ముందు ఇవి భూమిలో చల్లితే వర్షాలకు మొలకలు వచ్చి పచ్చిరొట్ట ఎరువుగా మారతాయన్నారు. ఈ మొక్కలను 45 రోజుల తరువాత భూమిలో కలియదున్నితే నేల సారవంతమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంసీఎలు, ఐసీఆర్పీలు, రైతులు పాల్గొన్నారు.

మాల ఉద్యోగుల సంఘ అధ్యక్షుడిగా భాస్కరరావు



రేపల్లె: పట్టణంలోని అంబేడ్కర్ భవనంలో గురువారం మాల ఉద్యోగుల సంక్షేమ సేవా సంఘం నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ మాజీ అధ్యక్షుడు అంబటి జాకబ్ మాట్లాడుతూ నూతన కమిటీ అధ్యక్షుడుగా దర్శి భాస్కరరావు ఎన్నికవ్వగా, ప్రధాన కార్యదర్శిగా కొరివి రాంబాబు, ఆర్థిక కార్యదర్శిగా గుండాల ఆనంద్, గౌరవాధ్యక్షులుగా గాలి సురేష్, గద్దె వెంకట్రావు, ఉపాధ్యక్షుడుగా ఆరిగ శ్రీనివాసరావు, జాయింట్ సెక్రటరీగా తెనాలి చిన్నా ఎన్నికయ్యారన్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వైసీఎస్ కృపారావు, గద్దె రవీంద్ర, టి.కోటేశ్వరరావు, దాసరి సహదేవరావు, న్యాయ సలహాదారునిగా దారం సాంబశివరావును ఎన్నుకున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు దర్శి భాస్కరరావు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తానని చెప్పారు.

జెడ్పీ హైస్కూల్లో తనిఖీ



జెడ్పీహైస్కూల్‌ను తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శిరీష

నిజాంపట్నం: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్నట్లు తహసీల్దార్ శిరీష తెలిపారు. అడవులదీవి జెడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠశాలలోని డిజిటల్ క్లాస్‌రూమ్, టాయిలెట్స్, తాగునీటి ప్లాంట్, ల్యాబ్ రూమ్‌ను, నూతనంగా నిర్మాణం జరుగుతున్న అదనపు తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శిరీష మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా సర్కారు పాఠశాలలను ప్రభుత్వం తీర్చిదిద్దడం జరుగుతోందని చెప్పారు. ఈ అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో ఏకాగ్రత పెంపు



జంపని(వేమూరు): ధ్యానం చేయడంతో విద్యార్థులకు ఏకాగ్రత పెరుగుతుందని పిరమిడ్ మాస్టర్ జి.సాంబశివరావు తెలిపారు. జంపని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శ్రీసాయి ధ్యాన పిరమిడ్ కేంద్రం ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులతో ధ్యాన సాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రోజు ఉదయం, సాయంత్రం 15 నిమిషాలు ధ్యానం చేస్తే అద్భుత ఫలితాలు సాధించవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బద్రినారాయణ, ఉపాధ్యాయులు శ్రీనివాస్ కుమార్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో వేరుశనగకు నష్టం



ఈదుపల్లిలో వేరుశనగ పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు విజయనిర్మల, మృదుల

నగరం: రబీ సీజన్‌లో సాగుచేసిన వేరుశనగ పంటకు అధిక వర్షాల వల్ల నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాస్త్రవేత్తలు ఎం.విజయనిర్మల, డాక్టర్ కె.మృదుల తెలిపారు. ఈదుపల్లి గ్రామంలో గురువారం వ్యవసాయ శాస్త్రవేత్తలు వేరుశనగ పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా విజయనిర్మల మాట్లాడుతూ అధిక వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించామని చెప్పారు. వేరుశనగ పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించామన్నారు. పంట నష్ట వివరాలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని పేర్కొన్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంటలకు రైతులు తగిన సస్యరక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ అక్తర్ హుస్సేన్, ఏవో రమేష్‌బాబు, ఏఈవో ఎం.శ్రీనివాసరావు, వీఏఏలు పాల్గొన్నారు.

జగనన్న స్వచ్ఛ సంకల్ప అవార్డులు

వేమూరు: గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణలో మెరుగైన పనితీరుకు ప్రోత్సాహంగా మండలానికి ప్రభుత్వం అవార్డు అందజేసిందని ఇన్‌చార్జి ఎంపీడీవో సునీత తెలిపారు. వేమూరు మండలంలోని అబ్బనగూడవల్లి, పోతుమర్రు గ్రామాల్లో గ్రామీణ ఘన వ్యర్థాల నిర్వహణను ఐటీసీ వారు పరిశీలించి అవార్డుకు ఎంపిక చేశారని ఆమె తెలిపారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా మంగళవారం అవార్డులను అందజేశారు. వేమూరు నియోజకవర్గంలోని చుండూరు ఎంపీడీవో సుగుణమ్మ, కొల్లూరు ఎంపీడీవో సత్యనారాయణ, మండల పంచాయతీ విస్తరణాధికారులు చుండూరు, అమర్తలూరు కొల్లూరు మండల పంచాయతీ అధికారులు విజయలక్ష్మి, మరియదేవి, చొప్పర శేఖర్ కూడా అవార్డులు అందుకున్న సందర్భంగా సిబ్బంది అధికారులకు అభినందనలు తెలిపారు.

పౌష్టికాహార లోపంతో రక్తహీనత

డీఎల్‌పీవో శరత్‌బాబు.

కర్లపాలెం: పౌష్టికాహార లోపంతో రక్తహీనత వస్తుందని బాపట్ల డివిజన్ ఇన్‌చార్జి డీఎల్‌పీవో పీడీఎస్ శరత్‌బాబు చెప్పారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో పోషణ పట్వాడా కార్యక్రమంపై ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. జగనన్న స్వచ్ఛ సంకల్పం ఉత్తమ ఎంపీడీవోగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్న ఎంపీడీవో ఎలీషాబాబును, పోషణ పట్వాడా సమావేశానికి ముఖ్య అతిథిగా వచ్చిన డీఎల్‌పీవో శరత్‌బాబును ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు సన్మానించారు. డీఎల్‌పీవో శరత్‌బాబు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో రక్తహీనత ఉన్న మహిళలు, చిన్నారులను గుర్తించి అదనపు పౌష్టికాహారం అందజేయాలని చెప్పారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి షేక్ సుహానా బేగం మాట్లాడుతూ రక్తహీనత నివారణకు కావలసిన పౌష్టికాహారాన్ని తక్కువ ఖర్చుతో తయారు చేసుకునే విధంగా మహిళలకు అంగన్‌వాడీ కార్యకర్తలు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎలీషాబాబు, ఏపీఎం శ్రీనివాసులురెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగమల్లేశ్వరి, శేషుకుమారి, సౌజన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలతో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మమేకం కావాలి

బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు



మాట్లాడుతున్న బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ శ్రీనివాసరావు

తెనాలిటౌన్: బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాతీయ సేవా శిబిరం (ఎన్ఎస్ఎస్) ద్వారా విద్యార్థినులు గ్రామంలోని రైతులు, ప్రజలతో మమేకం కావాలని బాపట్ల వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్, ప్రొఫెసర్ డాక్టర్ వి.శ్రీనివాసరావు సూచించారు. ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం ఆదేశాల మేరకు బాపట్ల వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో ఈ నెల 23 నుంచి 29 వరకు రూరల్ మండలం కొలకలూరు గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని ముఖ్యఅతిథిగా హాజరైన డాక్టర్ వి.శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రొఫెసర్ ప్రసన్నకుమారి సభకు అధ్యక్షత వహించారు. సభలో డాక్టర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా గ్రామంలో పలు సేవా కార్యక్రమాలు అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యవసాయానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, వ్యవసాయ కళాశాల విద్యార్థులు శిబిరంలో పాల్గొని రైతులకు పలు సూచనలు, సలహాలు అందివ్వాలన్నారు. వ్యవసాయంలో ఆధునిక పద్ధతులు, నానో టెక్నాలజీ, రోడ్డు టెక్నాలజీ తదితర అంశాల గురించి రైతులకు వివరించాలన్నారు. ప్రొఫెసర్ శివన్నారాయణ మాట్లాడుతూ రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వ్యవసాయంలో పాటించే ఆధునిక పద్ధతులు, పంట దిగుబడులు, ఖర్చులు గురించి విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ ప్రసన్నకుమారి మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ శిబిరం ద్వారా గ్రామంలో సామాజిక, ఆర్థిక సర్వే చేపడతామని చెప్పారు. వైస్ ఎంపీపీ కోడూరు స్వప్న, ఎంపీటీసీలు డి.నాగదేవిక, చక్కా సీతమ్మ, ఆర్‌బీకే వ్యవసాయ సహాయకులు నాగరాజు మాట్లాడారు. సభలో ఆచార్య ఏఎన్‌యూ జియాలజీ విభాగాధిపతి డాక్టర్ పీజే రత్నాకర్, రైతులు కాలిశెట్టి అప్పారావు, తాళ్లూరి అచ్యుతరామయ్య, తులబంధుల శివనాగేశ్వరరావు, అరవపల్లి నాగేశ్వరరావు, వేజండ్ల రాధాకృష్ణమూర్తి, అంచె రోశయ్య, సూరవరపు శ్రీనివాస్‌రెడ్డి, విన్నపాల సీతయ్య, 30 మంది ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాల పెంపునకు కృషి చేయాలి

తహసీల్దార్ చిన్నం సుధారాణి

పిట్టలవానిపాలెం: పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంపునకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తహసీల్దార్ చిన్నం సుధారాణి తెలిపారు. చందోలు గ్రామ సచివాలయం, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వారంలో ఒక రోజు గ్రామ సచివాలయం, పాఠశాలను తనిఖీ చేయడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను పెంచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని చెప్పారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. అనంతరం పాఠశాల, గ్రామ సచివాలయంలోని రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. జగనన్న గోరుముద్ద పథకం పనితీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూను అమలు చేయాలని ఆదేశించారు. ఆమె వెంట సీఆర్పీలు ముసలయ్య, సచివాలయ కార్యదర్శి వీరేంద్ర, మహిళా సంరక్షకురాలు శిరీష ఉన్నారు.

శ్రీరాముడు ధర్మ స్వరూపుడు

టీటీడీ 5 జిల్లాల సూపరింటెండెంట్ ఎం.క్రాంతికుమార్

ఐలవరం(భట్టిప్రోలు): శ్రీరాముడు ధర్మ స్వరూపుడని అందుకే రామో విగ్రహావాన్ ధర్మః అన్నారని టీటీడీ 5 జిల్లాల సూపరింటెండెంట్ ఎం.క్రాంతి కుమార్ పేర్కొన్నారు. గురువారం ఐలవరంలోని సీతారామ మందిరంలో శ్రీమద్రామాయణ సప్తాహ ప్రవచన కార్యక్రమం టీటీడీ, హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ మాట్లాడుతూ మూర్తీభవించిన ధర్మ స్వరూపుడైన శ్రీరాముడు మానవుడు ఏ విధంగా ధర్మాన్ని ఆచరించాలో, అనుసరించాలో తెలియజేసి మనందరికీ ఆదర్శప్రాయులయ్యారన్నారు. అన్నదమ్ములు, భార్యాభర్తలు ఏ విధంగా నడుచుకోవాలో తెలియజెప్పారని, అందుకే శ్రీరామ నవమికి వాడవాడల స్వామి వారి కల్యాణాలు జరుగుతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, డి.సత్యన్నారాయణ, ఎం.రంగారావు, కేవీబీ రమణ పాల్గొన్నారు.

స్ఫూర్తిప్రదాత భగత్‌సింగ్

సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్

రేపల్లె: దేశ స్వాతంత్య్రం కోసం యువతను చైతన్యపరిచిన ఘనత భగత్‌సింగ్‌కే దక్కుతుందని సీపీఎం పట్టణ కార్యదర్శి మణిలాల్ అన్నారు. భగత్‌సింగ్ 92వ వర్ధంతి సందర్భంగా స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో విదేశీ పాలన ఉండకూడదన్న లక్ష్యంతో బ్రిటిష్ వారు దేశం నుంచి వెళ్లిపోవాలని భగత్‌సింగ్ ఉద్యమంలో చిన్న వయసులోనే అనేక విజయాలు సాధించి ప్రాణాలర్పించారన్నారు. దేశం కోసం తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన ఈ నాయకులను యువత స్ఫూర్తిగా తీసుకుని దేశ అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఆశీర్వాదం, కేవీ లక్ష్మణరావు, సూర్య ప్రకాష్, డి.శ్రీనివాసరావు, జి.దానియాలు, నవీన్, రామకృష్ణ, అగస్టిన్ తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్ణ పోషణ పిల్లలను గుర్తించాలి

భట్టిప్రోలు: మండల స్థాయిలో అసంపూర్ణ పోషణ స్థితిలో ఉన్న పిల్లల వివరాలు సేకరించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పశుసంవర్ధక శాఖాధికారి డాక్టర్ ఎం.హనుమంతరావు ఆదేశించారు. ప్రతి నెల 4వ గురువారం మండల స్థాయిలో నిర్వహించే అసంపూర్ణ పోషణ నివారణ కమిటీ సమావేశం గురువారం భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి పౌష్టికాహారం అందేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ బొంతా అర్జునరావు, ఎంపీడీవో చంద్రశేఖరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు మాణిక్యం, ఫజురున్నీస్సా, సీహెచ్‌వో డి.మాతయ్య పాల్గొన్నారు.

ఒడిశా యువకుడు బలవన్మరణం



పింటు నాయక్ మృతదేహం

కర్లపాలెం: ఒడిశాకు చెందిన ఓ యువకుడు ఉరి వేసుకుని బలవన్మరణం చెందిన సంఘటన గురువారం కర్లపాలెం మండలంలోని తుమ్మలపల్లి గ్రామ రొయ్యల చెరువు వద్ద చోటుచేసుకుంది. కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య కథనం మేరకు.. ఒడిశాకు చెందిన కొంతమంది యువకులు తుమ్మలపల్లిలోని రొయ్యల చెరువుల వద్ద కూలి పనుల కోసం వచ్చి ఉంటున్నారు. వీరిలో పింటు నాయక్ (22) ప్రేమించిన యువతికి ఆమె పెద్దలు వేరే యువకునితో పెళ్లి చేయడంతో ప్రేమ విఫలమై చెరువుల వద్ద రేకుల షెడ్డులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పింటు నాయక్ సోదరుడు ఉత్తమనాయక్ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు

భట్టిప్రోలు: రంజాన్ (ఈద్–ఉల్–ఫితర్) ముస్లింలకు అతి పవిత్రమైన మాసం. ఈ నెలలో ప్రతి రోజూ 5 సార్లు నమాజుతో పాటు ఉపవాస దీక్షలు పాటిస్తారు. శుక్రవారం నుంచి రంజాన్ మాసం ప్రారంభం కానుంది. వేమూరు నియోజకవర్గంలో ముస్లిం జనాభా నివసించే ప్రాంతం భట్టిప్రోలు. రంజాన్ మాసం ఆరంభంతో మసీదుల్లో సందడి నెలకొంది. రంజాన్ మాసంలో నెల రోజులు ఉపవాసాలు ఉండేందుకు వీలుగా అవసరమైన అన్ని వసతులు ముస్లిం సోదరులు సమకూర్చుకుంటున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా నిర్వాహకులు సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నారు. భట్టిప్రోలు, అద్దేపల్లి, వేమవరం, వెల్లటూరు, పల్లెకోన వేమూరు, జంపని, అమృతలూరు, ఇంటూరు, యడ్లపాడు, చుండూరు మండలం మోదుకూరు, కొల్లూరు మండలం అనంతవరం ప్రాంతాల్లో ముస్లిం కుటుంబాలు అధికంగా ఉన్నాయి.

గిరిజనులకు పక్కాగృహాలు మంజూరు చేయాలి

రేపల్లె: గ్రామ పొలిమేరల్లో కాలువ కట్టలపై నివసిస్తున్న నిరుపేద గిరిజనులకు పక్కాగృహాలు మంజూరు చేయాలని ట్రైబల్స్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత రావురి అంజలి కోరారు. గురువారం తహసీల్దార్ మల్లికార్జునరావుకు ఆమె ఈ మేరకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. చెట్ల కింద, కాలువ కట్టలపై ఎంతో కాలంగా జీవిస్తున్న నిరుపేద గిరిజనులకు ఆధార్, రేషన్ కార్డ్, ఆరోగ్యశ్రీ కార్డులను జారీ చేసి ప్రభుత్వం ఇస్తున్న పక్కా గృహాలు మంజూరు చేయాలన్నారు.